

ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్

విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్సీఈఆర్టీ సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. 8లో▸



జోరుగా వన మహోత్సవం

వర్షాలు కురుస్తుండడంతో పల్లెలో వన మహోత్సవం కర్యాక్రమం చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో, పంట పొలాల్లో మొక్కలు నాటుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /26.6

వాతావరణం

ఆకాశం దాదాపు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాపహరేశ్వరునికి జలాభిషేకం



జలాభిషేకంతో నిండిన పాపహరేశ్వరాలయం గర్భగుడి

దిలావర్‌పూర్: మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరాలయంలో కదిలి, మాడేగాం గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలనీ, పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల రైతులు స్వామివారికి జలాభిషేకం చేశారు. అనంతరం అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు, రెండు గ్రామాలకు చెందిన రైతులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

డాక్టర్లకు సన్మానం



సన్మానం పొందిన వైద్యులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

నిర్మల్‌టౌన్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన డాక్టర్లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డాక్టర్ కె.మురళీధర్ (పిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ రామచంద్రారెడ్డి(ఆర్థోపెడిషయన్), డాక్టర్ సరోజ(గైనకాలజిస్ట్), డాక్టర్ అమరేశ్వర్(స్కిన్ స్పెషలిస్ట్), డాక్టర్ కృష్ణంరాజు(నేత్ర వైద్య నిపుణులు)ను శాలువా, పూలబొకే, మెమొంటోతో సత్కరించారు. అనంతరం నేషనల్ చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ మునీంద్రారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నేరెళ్ల హనుమంత్, మేకల శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మీనారాయణగౌడ్, లక్కడి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



మొక్క నాటుతున్న ఎంపీపీ, బెటాలియన్ ఉద్యోగులు

భైంసాటౌన్: చెట్లతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. పట్టణ శివారులోని టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృక్ష సంపద పెరగాలంటే మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛందంగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీవో మొజం హుస్సేన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, ఏపీవో శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అన్నారు.. చేతులెత్తేశారు!



- బాసర ఆలయంలో ప్రారంభంకాని ఈ టికెటింగ్
- జూలై 1 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు ఇస్తామని ప్రకటన
- మళ్లీ మ్యాన్‌వల్‌గానే వివిధ సేవల టికెట్లు జారీ
- పకడ్బందీ నియమాల అమలు ఎప్పుడో..

భైంసా: బాసర జ్ఞానసరస్వతీ దేవి ఆలయంలో ఆన్‌లైన్ టికెట్ల జారీ అమలులోకి రాలేదు. జూలై 1 నుంచి అన్నిరకాల సేవల టికెట్లు ఆన్‌లైన్‌లో జారీ చేస్తామని ఈవో విజయరామారావు ఇటీవల ప్రకటించారు. ఈమేరకు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చినట్లు ప్రకటించారు. ఆ తర్వాత జూన్ 28న బాసరలో ప్రసాదాల టికెట్ల రీసైక్లింగ్ విషయం వెలుగు చూసింది. ఈ సందర్భంగా కూడా ఈవో మరోమారు జూలై 1 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు జారీ చేస్తామని తెలిపారు. ప్రసాదాల విక్రయాల్లో గోల్‌మాల్‌కు బాధ్యులైన ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులతోపాటు నలుగురు తాత్కాలిక ఉద్యోగులను సస్పెండ్ చేశారు.



జూలై 1న భక్తులకు విక్రయించిన టికెట్లు

పాత విధానంలోనే జారీ..

దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు బాసర ఆలయం ఈవో ప్రకటించినట్లుగా సోమవారం నుంచి ఆన్‌లైన్ టికెటింగ్ అమలులోకి రావాలి. కానీ, ఏ విభాగంలోనూ ఆన్‌లైన్ టికెట్ జారీ చేయలేదు. బాసర అమ్మవారి ఆలయంలో వచ్చిన భక్తులకు కాగితంతో ముద్రించిన పాత పుస్తకాల నుంచే ఆలయం ముద్రవేసి టికెట్లను విక్రయించారు.

ఆన్‌లైన్ ఎప్పుడో...

ఆన్‌లైన్ విధానం బాసర ఆలయంలో ఎప్పుడు అమలు చేస్తారో తెలియడంలేదు. కొన్నేళ్లుగా బాసర ఆలయంలో ప్రసాదాల విభాగంలో అక్రమాలు జరుగుతున్నాయి. స్టోర్‌రూంలోనూ అవకతవకలకుపాల్పడుతున్నారు. ప్రసాదాల విక్రయాల్లో వచ్చిన సొమ్మును కిందిస్థాయి నుంచి పై అధికారుల వరకు పంచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల తనిఖీలు కూడా నామమాత్రమే కావడంతో ఇక్కడ అంతా వారికి తెలిసే జరుగుతుందని అనుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉన్నతస్థాయి అధికారులు కూడా టికెట్ల విషయంలో ప్రసాదాల కౌంటర్లలో తనిఖీలు చేపట్టలేదు. దీంతో ఇక్కడ ఉన్న సిబ్బందే అందుకు అనుగుణంగా పనిచేస్తూ అక్రమంగా ఎలా సంపాదించాలో మార్గం వెతుక్కుంటున్నారు.

నిఘా వ్యవస్థ ఉన్నా..

బాసర ఆలయంలో పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉంది. అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి. కానీ ఈ నిఘా వ్యవస్థను ఆలయానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రదేశాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వినియోగించడం లేదు. టికెట్ కౌంటర్లలో సీసీ కెమెరాలు బిగించి ఈవో కార్యాలయానికి అనుసంధానంచేస్తే అక్కడి దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించొచ్చు. ఆర్జిత సేవలు, అక్షరాభ్యాసాలు, ప్రసాదాల కౌంటర్లు, విక్రయ కేంద్రాల వద్ద, అవసరం అనుకుంటే మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఏ రోజుకు ఆ రోజు నిఘా పెంచాలి. పర్యవేక్షణ పెరిగితే అక్కడ పనిచేసే వారు బాధ్యతగా విధులు నిర్వహిస్తారు.

తాత్కాలిక ఉద్యోగులు...

ఆలయానికి ఆదాయం తెచ్చిపెట్టే కౌంటర్లలో రెగ్యులర్ ఉద్యోగులకు విధులు కేటాయించాలి. కానీ బాసర సరస్వతీదేవి ఆలయంలోని చాలా కౌంటర్లలో తాత్కాలిక ఉద్యోగులే పనిచేస్తున్నారు. అమ్మవారి ఆలయానికి లక్షల రూపాయల ఆదాయం తెచ్చే ఈ కౌంటర్లలో ఏవైనా అక్రమాలు జరిగితే తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులే వెనుక ఉండి కౌంటర్లలో తాత్కాలిక ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆలయంలో అంతర్గత బదిలీల కోసం సిబ్బంది లక్షల రూపాయలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయం తెచ్చిపెట్టే ప్రాంతాల్లో విధులు నిర్వహించుకునేందుకు ఈ డబ్బు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే...

గతనెల 28న బాసర గ్రామస్తులు అడ్డుకోవడంతో ప్రసాదాల్లో గోల్‌మాల్ వ్యవహారం బయటకు వచ్చింది. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు చేపడితే అవినీతి, అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంటుంది. ఆకస్మిక తనిఖీలు చేపడితే ఉద్యోగుల్లోనూ భయం ఉంటుంది. జిల్లాస్థాయి అధికారులు సైతం అప్పుడప్పుడూ తనిఖీలు నిర్వహిస్తే పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తారు. బాసర ఆలయానికి లక్షల్లో భక్తులు వస్తున్నారు. ఆదాయం అదే రీతిలో పెరగాలి. కానీ భక్తులు ఎక్కువగా ఉన్నా ఆదాయం తక్కువగా వచ్చినట్లు చాలా సందర్భాల్లో అధికారులు ప్రకటించారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు నిబంధనలను కఠినతరం చేసి ఆదాయాన్ని తీసుకువచ్చే ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందిపై ప్రత్యేక దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

జిల్లాలో కొత్త చట్టాలు అమలు..

- లక్ష్మణచాందలో మొదటి కేసు నమోదు

నిర్మల్‌టౌన్: భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు–2023 సోమవారం అమల్లోకి వచ్చినట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులకు సిబ్బందికి విడతల వారీగా చట్టాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కొత్త చట్టాలపై ప్రజలు కూడా అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

లక్ష్మణచాందలో మొదటి కేసు..

లక్ష్మణచాంద మండలం నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన దేశ బోయిన పోశెట్టి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. కొత్త చట్టాలు అమలు కావడంతో ఎస్పీ జానకీషర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై సుమలత సెక్షన్ 194(1) భారతీయ నాగరికత సుర్క్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

భైంసా ఏఎస్పీగా అవినాష్‌కుమార్



అవినాష్‌కుమార్

భైంసాటౌన్: భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో 2021 బ్యాచ్ ఐపీఎస్ అవినాష్‌కుమార్(అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్)ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2023 జనవరిలో కాంతిలాల్ పాటిల్ భైంసా ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించగా, 16 నెలలపాటు విధులు నిర్వర్తించారు.

భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్, నోడల్ అధికారి అనిత, జలశక్తి అభియాన్ సాంకేతిక అధికారి సుశాంత్ కుమార్ రాతాతో కలిసి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులు, సదర్మట్ బ్యారేజీల ఆయకట్టు, సాగు విస్తీర్ణం తదితర అంశాలను కేంద్ర అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారీ శక్తి సే జల్ శక్తి అనే ఇతివృత్తంతో భూగర్భ జలాలు సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోరు బావుల వద్ద నీటి లభ్యతను పెంచేందుకు రీచార్జి శాఫ్ట్ అనే అధునాతన పద్ధతిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో నీరు భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధిహామీ పథకం పనుల ద్వారా గుంతలు తవ్వి నీటిని ఒడిసిపడుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి శుద్ధమైన తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థితిగతులను, భూగర్భ జలాలకు సంబంధించిన డీఆర్డీవో, నీటిపారుదల, మిషన్ భగీరథ, భూగర్భజల శాఖల వారీగా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. అనంతరం కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్, నోడల్ అధికారి మాట్లాడుతూ, జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెరిగేలా, భావితరాలకు నీరు ఉండేలా సంరక్షించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, భూగర్భ జలాల డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసబాబు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఇరిగేషన్ ఈఈ లక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో 747 మంది ఎస్జీటీల బదిలీ

- నేడు కొత్త స్థానాల్లో చేరిక

నిర్మల్ రూరల్: జిల్లాలో 747 మంది ఎస్జీటీలు బదిలీ అయ్యారు. మొత్తం 895 మంది ఎస్జీటీలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం వెబ్ ఆప్షన్లకు సమయమిచ్చారు. వీరందరికీ సోమవారం పాఠశాలలను అలాట్ చేశారు. 895 మంది ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోగా ఒక వృత్తి విద్య ఉపాధ్యాయుడు, ఒకరు హిందీ పండిత్, ఆరుగురు తెలుగు పండితులు, ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు, 734 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. మిగిలిన 148 మంది ప్రస్తుత స్థానంలోనే కొనసాగనున్నారు. బదిలీ అయినవారంతా సోమవారం మధ్యాహ్నం రిలీవ్ అయ్యారు. మంగళవారం కొత్త పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనకు అనుగుణంగా ఉపాధ్యాయులను రిలీవ్ చేసి నూతన పాఠశాలల్లో చేర్చుకోవాలని ఎంఈవోలను డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న జిల్లా ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇతర భూ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండలాలవారీగా ప్రత్యేక అధికారులు ప్రభుత్వ హాస్టళ్లు, తాగునీరు, శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రత్నాకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించిన వార్డు సభ్యుడు..

కడెం మండలం నరసాపూర్ గ్రామం జగదాంబ తండా 5వ వార్డు సభ్యుడు ధారం సోత్ రాజేశ్ తాండకు చెందిన రోడ్డును ఆక్రమించుకుని, ఆ స్థలంలో గుడిసే వేశాడని తండా వాసులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో నడవడానికి కూడా కష్టంగా ఉందని పేర్కొన్నారు. దీనిపై ఏడాదిగా మండల అధికారులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. జిల్లా పంచాయతీ అధికారి విచారణ జరిపించి ఆక్రమణ తొలగించాలని కలెక్టర్‌ను కోరారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాసంస్థల యాజమాన్యం పుస్తకాలు, యూనిఫాం, ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని నిర్మల్ జిల్లా కన్వీనర్ కైలాశ్, నాయకులు ప్రవీణ్, అంబాదాస్, వినేశ్ కోరారు.

మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

నేషనల్ హెల్త్ మిషన్ కింద స్టాఫ్ నర్సు పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, పోస్టుల భర్తీలో తమకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుట్ల ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో స్టాఫ్ నర్సుగా పనిచేసిన సురేశ్ అదనపు కలెక్టర్‌ను కోరారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు వచ్చాక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాని తెలిపారు. కొత్తగా చేపట్టే నియామకాల్లో ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరాడు.

శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలి..



శ్మశాన వాటిక భూమిని కాపాడాలని కలెక్టరేట్‌కు వచ్చిన గొల్లపేట కాలనీవాసులు

గొల్లపేట్‌కాలనీ తూర్పు వైపు సీతాసాగర్ చెరువు కట్ట కింద రెండు ఎకరాల శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేసుకోవడానికి ప్రయత్నంచేస్తున్నారు. వారిపై తగిన చర్య తీసుకుని శ్మశాన వాటిక స్థలాన్ని రక్షించాలని కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వెట్టిచాకిరీ నుంచి చిన్నారులను కాపాడాలి

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ రూరల్: జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి చిన్నారులను వెట్టి చాకిరీ నుంచి కాపాడాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. ఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్ జూలై 1 నుంచి 31 వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో తప్పిపోయిన, వదిలేయబడిన, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న, బాల కార్మికులుగా పనిచేస్తున్న 18 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అప్పగించడం లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. జిల్లాలో బాల కార్మికులు కనిపిస్తే డయల్ 100 కానీ, చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన పెంచాలని తెలిపారు. బాల కార్మికుల నిర్మూలన కోసం ప్రతీనెల ఒక కార్యక్రమం నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీనెల ఒక్కోరంగాన్ని ఎంచుకుని, ఆయా రంగాల్లో పనిచేసే బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించాలన్నారు. చిన్నారులతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, సోన్ సీఐ నవీన్‌కుమార్, భరోసా సెంటర్ ఇన్‌చార్జ్ జ్యోతిమణి, చైల్డ్‌వెల్ఫేర్, కార్మికశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖానాపూర్ వాసికి వట్టికోట అళ్వారుస్వామి స్మారక అవార్డు



అవార్డు అందుకుంటున్న రుద్ర శంకర్

ఖానాపూర్: గల్ఫ్ తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఖానాపూర్‌వాసి రుద్ర శంకర్ వట్టికోట అళ్వారుస్వామి స్మారక అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, కవి బోయ భీమన్న చేతుల మీదుగా 'నిస్వార్థ తెలంగాణ ఉద్యమకారుడి' అవార్డు అందుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నిర్మల్ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, కవితల పోటీలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. భూతాపాన్ని తగ్గించడానికి చెట్లు ఎంతో తోడ్పడుతాయన్నారు. పాఠశాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలోని 30 ఎన్జీసీ ఎకో క్లబ్ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ మోహన్‌రావు, ఎస్ఓ నరసయ్య, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలు వీరే...

పోస్టర్ మేకింగ్‌లో.. ప్రథమ ఎం.గాయత్రి(కేజీబీవీ నర్సాపూర్), ద్వితీయ ఎం.సంపద (జెడ్పీహెచ్ఎస్, సిద్దులకుంట), తృతీయ ఉదయ్‌కిరణ్, కవితల పోటీల్లో .. ప్రథమ జి.హారిణి(జుమ్మెరాత్‌పేట్), ద్వితీయ ఐమాన్(సోన్), తృతీయ సాహితి (కేజీబీవీ నిర్మల్ అర్బన్)కు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

దొంగిలించిన వెండి రికవరీ



రికవరీ చేసిన వెండి పట్టీలు

ఆదిలాబాద్‌టౌన్: బంగారం షాపులో వెండి పట్టీలు దొంగిలించిన మహిళ నుంచి రికవరీ చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. గతనెల 21న పట్టణంలోని వంశీకృష్ణకు చెందిన బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా దేగామకు చెందిన ఉషాబాయి దగ్గు కేజీ వెండి పట్టీలను దొంగిలించి ఆతర్వాత పరారయ్యింది. బాధితుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరోసారి దొంగతనం చేసేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె రైల్వే స్టేషన్‌లో పోలీసులకు కనిపించడంతో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్, హెడ్‌కానిస్టేబుల్ రాధ, కానిస్టేబుల్ పుష్ప, సీసీఎస్ పోలీసులు జాకీర్, రాహత్, శ్రీనివాస్ అరెస్టు చేశారు.

శివాలయంలో చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆలయంలోని సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు దుండగులు వెనుకనుంచి మాస్కులు ధరించి ఆలయంలో ప్రవేశించారన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్ ఆస్పత్రిలో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గజానన్ ఆస్పత్రిలో ఈనెల 29న ఆదిలాబాద్‌కు చెందిన సమీర్, అయాన్ చోరీకి పాల్పడ్డారని టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి సంబంధించి సెల్‌ఫోన్, అక్కడ పనిచేసే మహిళా సిబ్బందికి సంబంధించి రూ.1500 నగదును దొంగిలించారు. ఆస్పత్రి సిబ్బంది సుదర్శన్ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ ఇద్దరు దుండగులు రాత్రి చోరీకి పాల్పడిన అనంతరం జైనథ్ మండలంలోని తరోడా ఆలయంలో సైతం చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడ్డారు. ప్రస్తుతం వారు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మంత్రి అర్చన (22) సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో యువతి తల్లి మంత్రి కవిత సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్‌కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.




రాళ్లపై చెక్కిన వడ్రంగి పిట్ట, ఊసరవెల్లి బొమ్మలు

వెదురుతో చేసిన సీలింగ్



గోడలపై వన్యప్రాణుల చిత్రాలు




ఆహ్లాదం పంచుతున్న విజ్ఞాన కేంద్రం

మావలలోని హరితవనం పార్క్ చూపరులను మైమరిపిస్తోంది. ఇక్కడ అధికారులు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పైకప్పును వెదురు బొంగులతో సీలింగ్ ఏర్పాటు చేసి గోడలపై గీసిన అటవీ జంతువుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. బండరాళ్లపై వడ్రంగి పిట్ట, ఊసరవెల్లితో పాటు వివిధ రకాల జంతువుల బొమ్మలను చెక్కారు. కలప మొద్దును ప్రదర్శనకు పెట్టారు. దీని ప్రత్యేకత ఎత్తు 15 మీటర్లు, వెడల్పు 2.10 మీటర్లు ఉండడం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



మావల హరితవనంలో ఏర్పాటు చేసిన పర్యావరణ విజ్ఞాన కేంద్రం



ప్రదర్శనకు ఉంచిన కలప దుంగ

ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్

- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ప్రతిభాన్వేషణ పరీక్ష
- విద్యార్థుల్లో పరిశోధనాభిరుచికి పదును
- కేంద్ర ప్రభుత్వ విద్యావనరులశాఖ తోడ్పాటు
- మొదలైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు కేవలం బట్టీ అభ్యసనానికి ప్రాధాన్యమివ్వకుండా వారిలో పరిశోధనాభిరుచిని పెంపొందింపజేసేలా ప్రయోగ రంగాలు, ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు పరుస్తోంది. ఇందులో భాగంగానే విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్) సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 2024–25విద్యా సంవత్సరానికి గానూ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు లక్షన్నరకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పరిశోధనాభిరుచి పెంపొందించేలా..

దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న పరిశోధనల కృషిని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. ఇప్పటికే ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ ఛాలెంజ్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండగా తాజాగా జాతీయస్థాయిలో వీవీఎం పరీక్షను కూడా నిర్వహిస్తున్నారు.

ప్రక్రియ ఇలా...

పాఠశాల స్థాయిలో జిల్లాలో 6 నుంచి 11వ తరగతిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని ఎంపిక చేసి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రం అందజేస్తారు.



రాష్ట్రస్థాయి సైన్స్‌మేళాలో తన ఆవిష్కరణను వివరిస్తున్న విద్యార్థి (ఫైల్)

ఏం చేయాలంటే..

ఆసక్తి కలిగిన విద్యార్థులు www. vvm. org. in అనే వెబ్‌సైట్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబర్ 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రకటించిన తేదీల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పాఠశాల జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. సెప్టెంబర్ 1న నమూనా పరీక్ష, అక్టోబర్ 23, 27 తేదీలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. నవంబర్ 15న ఫలితాలు విడుదల చేస్తారు. డిసెంబర్ 8, 15, 22 తేదీల్లో ఒక్కోరోజు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయి. 2025 మే 17 లేదా 18 తేదీల్లో జాతీయస్థాయి పరీక్ష ఉంటుంది. అయితే ఈ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులు చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జోనల్, జాతీయ స్థాయిలో...

జోనల్‌స్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతీ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని జాతీయ శిబిరానికి ఎంపిక చేస్తారు. జాతీయస్థాయిలో ప్రతీ తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని హిమాలయన్స్ విజేతలుగా ప్రకటించి ప్రథమ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

పరీక్షా విధానం ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 100 బహుళైచ్ఛిక ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు అభ్యసిస్తున్న గణితం, సైన్స్ పాఠ్యపుస్తకాల్లోని అంశాలు 50 శాతం, విజ్ఞాన శాస్త్రం రంగంలో భారతదేశం కృషిపై 20 శాతం, శాస్త్రవేత్తలు వారి జీవిత చరిత్ర అంశాలపై 20 శాతం మార్కులు ఉంటాయి. వీవీఎం వారు వెబ్‌సైట్‌లో అందించే స్టడీ మెటీరియల్ నుంచి సమాచారం సేకరించుకోవచ్చు. ఇక అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్‌పై 10 శాతం ప్రశ్నలుంటాయి. ఇవన్నీ కూడా సమకాలిన అంశాలపై కేంద్రీకృతమైన అంశాలతో కూడిన ప్రశ్నలుంటాయి.



రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ హోమ్‌పేజీ

పరిశోధనాభిరుచి పెంపొందుతుంది



పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక, విజ్ఞానశాస్త్ర అంశాలపై పట్టున్న విద్యార్థులు 'విద్యార్థి విజ్ఞాన మంథన్' ద్వారా జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుంది. పోటీలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి విజ్ఞాన శాస్త్ర అంశాలపై అభిరుచి కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో పరిశోధనాభిరుచి పెంపొందుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాచారం అందించాలి.

– డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

సిరిచెల్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న పరిశీలకులు అభినందన్

ఇచ్చోడ: మండలంలోని అతి పురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు అభినందన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న విగ్రహాలను పరి శీలించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం చుట్టూ ఉన్న కాకతీయుల కాలం నాడు నిర్మించిన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో భీంరావు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారాని కి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీవో కన క భీంరావు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాల య సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం శ్యామనాయక్ తండాకు చెందిన జానాబాయి ఉద్యోగం ఇప్పించాలని, ఇచ్చోడకు చెందిన వంశీ ఆర్థిక సాయం అందించాలని, వేమనపల్లి మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన పార్వతి ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని, ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, హెచ్‌ఓ సందీప్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

లక్ష్మణచాంద: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మత్స్యకారుడు దేశబోయిన పోశెట్టి (53) ఆదివారం రాత్రి చేపలు పట్టేందుకు బ్రాహ్మణ చెరువుకు వెళ్లాడు. చేపలు పట్టేక్రమంలో అతని కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సత్తెవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 194(1) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ఖానాపూర్: బైక్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండల కేంద్రానికి చెందిన మేకల లక్ష్మి (66) జన్నారం మండలం ఇందన్‌పల్లిలోని బంధువుల ఇంటికి మేనల్లుడు చంద్రయ్యతో కలిసి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బావిలోపడి బాలుడు..

దస్తురాబాద్: వ్యవసాయ బావిలోపడి బాలుడు మృతి చెందిన సంఘటన మల్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎంబడి లావణ్య, మల్లేశ్ దంపతుల రెండో కుమారుడు రాజ్‌కుమార్ (13) ఆదివారం సాయంత్రం తన సోదరితో కలిసి పంటచేనులోని వ్యవసాయ బావి మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. వెంటనే అతని సోదరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గ్రామస్తులతో కలిసి బావిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం అందించడంతో సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కడెం: అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవబ్‌పేట్ గ్రామానికి చెందిన మేడి కావ్య (29) కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 30న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు చిన్నమ్మ మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జైశ్రీరాం గోశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. జున్ని గ్రామానికి చెందిన శేషేరావు ద్విచక్ర వాహనంపై ఇచ్చోడకు వస్తుండగా గోశాల వద్దకు చేరుకోగానే ఆదిలాబాద్ నుంచి బోథ్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. నూతన చట్టం 125 (బీఎన్ఎస్) ప్రకారం తొలి కేసు నమోదైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 4 నెలల వేతనాలు ఇవ్వాలని, అన్ని శాఖల మాదిరి ప్రతీ నెల వేతనాలు ఇస్తూ టైం స్కేల్ వర్తింప జేయాలన్నారు. ఈనెల 14లోగా వేతనాలు విడుదల చేయాలని లేనిపక్షంలో 15 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు వంశీ, శ్రీనివాస్, వసంత్ కుమార్ పాల్గొనగా డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, తదితరులు మద్దతు తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా

బేల: మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున టమాట వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బెంగుళూరు నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లే క్రమంలో పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని ఈ 353బి జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. 100 క్యారెట్‌ల టమాటలు దెబ్బతినడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లి ఉంటుందని డ్రైవర్ తెలిపాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్ గండి రామన్న శివారులో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మృతునికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయన్నారు. వివరాలు తెలిసిన వారు 87126 59515, 8712659514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు, వంతెన పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని రామలింగంపేట్ నుంచి శ్యాంనాయక్‌తండా వరకు రూ.3.75 కోట్లతో చేపట్టిన తారురోడ్డు, వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం వల్ల అభివృద్ధి చెందుతుందన్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, కాంగ్రెస్ నాయకురాలు సుగుణ, జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఈఈ భీంరావు, అధికారులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అంతకుముందు మండలంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ గిరిజనులు సాగుచేస్తున్న పోడుభూముల్లో ఫారెస్ట్ అధికారులు బలవంతంగా కందకాలు తవ్వ డం నిలిపివేయాలన్నారు. భూమిలేని పేద కుటుంబాలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ ఏపీవో భీంరావుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిడాం ధర్మ, ఎనుముల నర్సయ్య, ఎల్లయ్య, చంద్రయ్య, సంధ్య, వనిత, గిరిజనులు పాల్గొన్నారు.